
సాక్షి విశాఖపట్నం

శుక్రవారం। 25। ఏప్రిల్। 2025



8లో



97 మంది పోలీసులకు రివార్డులు 8లో

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ జిల్లాల అధ్యక్షులకు అభినందనలు



కె.కె.రాజు, అమర్‌నాథ్‌లను గజమాలతో సత్కరిస్తున్న సమన్వయకర్తలు, నేతలు

విశాఖ సిటీ: వైఎస్సార్ సీపీ విశాఖ, అనకాపల్లి జిల్లాల నూతన అధ్యక్షులుగా నియమితులైన కె.కె.రాజు, గుడివాడ అమర్‌నాథ్‌లకు అభినందనలు వెల్లువెత్తాయి. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఇరువురికి నేతలు గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. విశాఖ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయ్‌ప్రసాద్, గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కె.సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాస రావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, కె.వి.ఎన్.శశికళ, కోడిగుడ్ల పూర్ణిమ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పంచాయతీలే మూలస్తంభాలు



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

బీచ్‌రోడ్డు: గ్రామాల అభివృద్ధికి పంచాయతీలే మూలస్తంభాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి పంచాయతీరాజ్ వ్యవస్థ కీలకంగా మారిందని, ప్రజలతో నేరుగా సంబంధాలు కలిగిన అధికారులుగా పంచాయతీరాజ్ ఉద్యోగులు గొప్ప బాధ్యతను నిర్వర్తిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో స్వయం సమృద్ధికి సర్పంచులు, వార్డు సెక్రటరీలు సేవలు అందించాలని సూచించారు. స్వయం శాసనం- గ్రామాల బలోపేతం అనే దృక్పథంతో పంచాయతీలను అభివృద్ధి దిశగా నడిపించాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతి గ్రామం అభివృద్ధిలో ముందుండేందుకు పంచాయతీ ప్రతినిధులు నిధుల సమీకరణపై దృష్టిసారించాలని సూచించారు. అనంతరం విశేష సేవలందించిన మోడల్‌గా నిలిచిన సర్పంచ్‌లకు జ్ఞాపికలు బహూకరించారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బి.సత్యవతి, డిప్యూటీ సీఈవో రాజ్ కుమార్, ఏపీపీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

రేపు డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి సంబంధించి ఈ నెల 26న ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు కౌన్సిల్ హాల్ ప్రాంగణంలోకి ప్రవేశించిన అనంతరం మొబైల్ ఫోన్లను ఫ్లైట్‌మోడ్‌లో పెట్టుకోవాలని సూచించారు. ఇతరులకు కౌన్సిల్ సమావేశ ప్రాంగణంలోకి అనుమతి లేదని స్పష్టం చేశారు. సభ్యులు, సంబంధిత అధికారులు గుర్తింపు కార్డుతో హాజరు కావాలన్నారు.

రెవెన్యూ అంశాలపై అవగాహన ముఖ్యం



మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

బీచ్‌రోడ్డు: రీ-సర్వే ప్రక్రియ, ఇతర రెవెన్యూ సంబంధి అంశాలపై క్షేత్రస్థాయి సిబ్బంది సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే విధి నిర్వహణ సజావుగా సాగుతుందని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అన్నారు. సర్వే-ల్యాండ్ విభాగం ఆధ్వర్యంలో కలెక్టరేట్ మీటింగు హాలులో గురువారం ఒక్కరోజు వర్క్ షాప్ జరిగింది. ఈ సందర్భంగా జేసీ రెవెన్యూ సంబంధిత అంశాలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. రెవెన్యూ రికార్డుల నిర్వహణ, ప్రజా వినతుల పరిష్కారం, చర్యలు, రీ-సర్వే ప్రక్రియ నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సిబ్బంది అడిగిన పలు ప్రశ్నలకు బదులిస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు. ఎప్పటికప్పుడు చోటు చేసుకుంటున్న మార్పులు, చేర్పులపై అప్‌డేట్ అవ్వాలన్నారు. భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, సర్వే విభాగం సహాయ సంచాలకులు సూర్యారావు, పలువురు తహసీల్దార్లు, డీటీలు, సర్వేయర్లు పాల్గొన్నారు.



- విశాఖలో రూ.99 పైసలకే ఎకరా

భలే మంచి చౌక బేరం

లూలూ మాల్‌కు కేటాయించిన భూములు

విశాఖ ఐటీ సెజ్ మధురవాడ హిల్ నెం.3లో ఉర్సా కంపెనీకి కేటాయించిన భూములు

- ఎకరం 99 పైసలకు టీసీఎస్‌కి కట్టబెట్టిన కూటమి సర్కారు
- అక్కడ ఎకరం రూ.50 కోట్ల పైమాటే..
- ఊరూ పేరూ లేని ఉర్సా కంపెనీకి 60 ఎకరాల భూ కేటాయింపు
- ప్రభుత్వ రంగ సంస్థలకు మార్కెట్ ధర ప్రకారమే భూములు
- ప్రైవేట్ సంస్థలకు మాత్రం రూపాయికే దోచిపెడుతున్న సర్కారు
- లూలూకి బీచ్ రోడ్డులో రూ.వేల కోట్ల భూములు అప్పగింత

ప్రైవేట్ సంస్థలకు భూముల ధారాదత్తం

కూటమి సర్కారు కన్ను విశ్వనగరి విశాఖపై పడింది. ఊరు పేరు లేని కంపెనీలకు రూ.వేల కోట్ల విలువైన భూములను ధారాదత్తం చేసేస్తోంది. రూ.50 కోట్లు విలువ చేసే ఎకరం భూమిని 99 పైసలకే కట్టబెట్టేసింది. గతంలో అధికారంలో ఉన్నప్పుడు విశాఖ భూముల రికార్డులను ట్యాంపరింగ్ చేసి రూ.వేల కోట్ల భూ కుంభకోణానికి తెరతీసిన టీడీపీ ప్రభుత్వం.. ఇప్పుడు అధికారదర్పంతో భూముల పందేరానికి తెగబడుతోంది. ప్రభుత్వ రంగ సంస్థలకు మార్కెట్ విలువ ప్రకారం భూకేటాయింపులు జరుపుతూ.. ప్రైవేట్ కంపెనీలకు కారు చౌకగా భూములను ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సాక్షి, విశాఖపట్నం: అధికార పీఠం ఎక్కింది మొదలు దోచుకోవడం.. పంచుకోవడమే పరమావధిగా పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం.. విశాఖ భూములను హాంఫట్ స్వాహా చేసేందుకు చకచకా పావులు కదుపుతోంది. 2014-19 మధ్య ప్రభుత్వ రికార్డులను సైతం ట్యాంపరింగ్ చేసిన టీడీపీ నేతలు వేల కోట్ల భూములను ఆక్రమించేసుకున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.వేల కోట్లు విలువ చేసే భూములను టీడీపీ భూ బకాసురుల ఆక్రమణల చెర నుంచి విడిపించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొచ్చింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అడ్డగోలుగా భూ కేటాయింపులు చేస్తూ విశాఖను హోల్‌సేల్‌గా అమ్మేస్తోంది. రూపాయికి ఏమొస్తుందో తెలియదు కానీ.. వైజాగ్‌లో మాత్రం ఎకరం భూమి అప్పనంగా వచ్చేస్తోందనేది ఇప్పుడు రాష్ట్రమంతటా హాట్‌టాపిక్‌గా మారిపోయింది. టీసీఎస్ కంపెనీకి మధురవాడ ప్రాంతంలో కేవలం 99 పైసలకే ఎకరం చొప్పున 21 ఎకరాలు ధారాదత్తం చేస్తుండటం సర్వత్రా విస్మయానికి గురిచేస్తోంది. ప్రైమ్ సిటీగా పేరొందిన రుషికొండ దగ్గర ఐటీ హిల్స్‌లో ఎకరం దాదాపు 50 కోట్లు వరకూ పలుకుతోంది. కానీ చంద్రబాబు ప్రభుత్వం మాత్రం తెర వెనుక బాగోతం నడిపి కేవలం 99 పైసలకే కట్టబెడుతూ ఉత్తర్వులు కూడా జారీ చేసేసింది.

ఉర్సా.. లూలూ.. ఎన్నెన్నో..!

ఊరూ పేరూ లేని కంపెనీ అప్పుడే పురుడు పోసుకుంది. ఉర్సా పేరుతో తెరపైకి వచ్చిన ఈ కంపెనీకి ఏకంగా 60 ఎకరాలు విశాఖలో ధారాదత్తం చేసేసింది. దీనికి కూడా అడ్డగోలుగా రూపాయికి ఎకరం చొప్పున కట్టబెట్టడంపైనా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 2017లో భూములు తీసుకొని ఒక్క ఇటుక కూడా పెట్టకపోవడంతో లూలూకి భూ కేటాయింపుల్ని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రద్దు చేసేసింది. తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. అదే వేల కోట్ల భూమిని నిబంధనలకు విరుద్ధంగా మళ్లీ లూలూ చేతిలో పెట్టేసింది. ఇలా అడ్డగోలు భూ కేటాయింపులు చూస్తుంటే.. ఇవన్నీ రాజకీయ కేటాయింపులేనన్నది స్పష్టమవుతోంది.

ప్రభుత్వ రంగ సంస్థలకు మార్కెట్ ధరకే..!

గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ రంగ సంస్థలకు కూడా రిజిస్ట్రేషన్ ధరకు భూములు కేటాయింపులు చేపట్టింది. గతంలో భారత నౌకాదళానికి ఎకరా రూ.కోటి, పోస్టల్‌కు 30 సెంట్లు రూ.కోటి, సీబీఐకి ఎకరా భూమిని రూ.కోటి చొప్పున కేంద్ర ప్రభుత్వ శాఖలకు కేటాయింపులు జరిగాయి. వైజాగ్ టెక్ పార్క్ లిమిటెడ్(వీటీపీఎల్)కు ఎకరం రూ.కోటి చొప్పున భూములు కేటాయించింది. 2022లో మధురవాడలో ఎన్‌సీసీ సంస్థకు ఎకరం భూమిని రూ.1.93 కోట్లకు ఇస్తే.. తక్కువ ధరకు అప్పగించేశారంటూ టీడీపీ నేతలు **గగ్గోలు** పెట్టారు. అదానీ డేటా సెంటర్‌కు కూడా **ఎకరం** రూ.కోటి చొప్పున కేటాయింపులు **చేశారు.** అదేవిధంగా ప్రభుత్వ రంగ సంస్థలైన **ఈఎస్ఐ**, నేవీ, పోస్టల్ డిపార్ట్‌మెంట్‌కు కూడా నిబంధనల మేరకు మాత్రమే భూములు కేటాయించారు. కానీ కూటమి ప్రభుత్వం కేవలం తమ స్వార్థ ప్రయోజనాల కోసం భూముల్ని దోచిపెడుతున్నట్లు స్పష్టమవుతోంది. అభివృద్ధి, ఉద్యోగాల ముసుగులో పెద్ద ఎత్తున భూదోపిడీతో పాటు భారీగా అవినీతి జరుగుతోందంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే తీరు కొనసాగితే త్వరలోనే వైజాగ్‌లో ప్రభుత్వ భూములన్నీ ప్రైవేట్ పరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

మధురవాడ కొండలు బోడికొండలు కావా..?



అగ్గిపెట్టె లాంటి ఉర్సా కంపెనీకి ఎక్కడా సేవలు లేవు. అలాంటి సంస్థకు వేల కోట్ల విలువ చేసే భూములు కట్టబెట్టడం చూస్తుంటే ఇది ముమ్మాటికీ చేసిన లబ్ధికి కృతజ్ఞత చూపించినట్లే కనిపిస్తోంది. మొన్న జరిగిన ఎన్నికల్లో సహకరించిన వారికి చంద్రబాబు భూపందేరాలు చేస్తున్నారు. పాత రిసార్టుల స్థానంలో నిర్మాణాలు చేపట్టి రుషికొండని బోడికొండగా మార్చేశారని చెబుతున్న చంద్రబాబు.. ఇప్పుడు మధురవాడ కొండలను మొత్తం కొల్లగొట్టేస్తున్నారు. అవి బోడికొండలు కావా.? ఇది కేవలం రాజకీయ కేటాయింపులే. టీసీఎస్ భూములు అడగకుండానే ఇవ్వడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటో చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేయాలి.

– కె.లోకనాథం, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు

సుప్రీంకోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు



టీసీఎస్ కంపెనీకి రుషికొండ ప్రాంతంలో విలువైన భూములను అతి తక్కువ లీజుకు ధారాదత్తం చేయడం ప్రజాప్రయోజనాలకు, సుప్రీంకోర్టు ఉత్తర్వులకు ముమ్మాటికీ విరుద్ధమే. రుషికొండలో రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం చదరపు గజం రూ.30 వేలు ఉంది. మార్కెట్ ధర అంతకంటే ఎక్కువ ఉంటుంది. రిజిస్ట్రేషన్ విలువ తీసుకున్నా 21.16 ఎకరాల భూమి రూ.320 కోట్లు మించి ఉంటుంది. అటువంటి భూమిని కేవలం 99 పైసలకు ఇవ్వడం హాస్యాస్పదం. రాష్ట్ర ప్రభుత్వం 2012లో జారీ చేసిన జీవో నెంబర్ 571 ప్రకారం ప్రభుత్వ భూములను మార్కెట్ విలువ మీద 10 శాతం కంటే తక్కువకు ప్రైవేట్ సంస్థలకు వార్షిక లీజుల కింద ఇవ్వకూడదు. ప్రైవేటు సంస్థలకు మార్కెట్ ధర కన్నా తక్కువ ధరకు ఇవ్వకూడదని సుప్రీంకోర్టు 2జీ స్పెక్ట్రమ్, ఇతర కేసుల్లో అనేక సార్లు ఆదేశాలు జారీ చేసింది. కానీ టీసీఎస్‌కు అతి చవక ధరకు ప్రభుత్వ భూమిని ఇవ్వడం సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడమే అవుతుంది.

– ఈఏఎస్ శర్మ, కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి

ఏడాదిలోపే ఇంతటి వ్యతిరేకతా?

- వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే అధికారం
- 11 నెలల మేయర్ పదవీ కాలం కోసం కూటమి కుట్రలు
- 35 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇటువంటి రాజకీయాలు చూడలేదు
- ఎన్ని ప్రలోభాలు పెట్టినా నిబద్ధతతో ఉన్న కార్పొరేటర్లకు అభినందన
- డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానాన్ని బహిష్కరిస్తున్నాం..
- శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

విశాఖ సిటీ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది తిరగక ముందే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అధికారంలోకి వచ్చేది వైఎస్సార్ సీపీయే అని శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్లతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కశ్మీర్‌లో ఉగ్ర దాడిని రాజకీయాలకు అతీతంగా అందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. వారి కుటుంబాలకు ఆత్మస్థైర్యం కలగాలని ఆకాంక్షించారు.

గెలుపోటములు సహజం


రాజకీయాల్లో గెలుపోటములు సహజమని ఆయన పేర్కొన్నారు. విశాఖ మేయర్ పీఠం కోసం కూటమి నేతలు దిగజారుడు రాజకీయాలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం 11 నెలల అధికారం కోసం కూటమి నేతలు అవిశ్వాసం పెట్టి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను ప్రలోభపెట్టి, లొంగకపోతే ఆర్థిక మూలలను దెబ్బతీస్తామని బెదిరించారని వెల్లడించారు. తమ కార్పొరేటర్ల కోసం రూ.25 లక్షలు ఖర్చు చేసి ప్రత్యేక విమానంలో కేరళకు వెళ్లడం పరాకాష్ట అన్నారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను ఎన్ని ఇబ్బందులు, ప్రలోభాలకు గురి చేసినా మెజార్టీ సభ్యులు పార్టీలోనే ఉన్నారని వారిని అభినందించారు. ఒక్క ఓటుతో ఓడిపోయినా ఓటమే అని, ఇది ఒక గుణపాఠంగా తీసుకొని అందరూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. రాబోయే విజయానికి ఇదే పునాదిరాయిగా అభివర్ణించారు. ఈ 11 నెలల కాలంలో కూటమి కార్పొరేటర్లు నగరాభివృద్ధి ఎలా చేస్తారో ప్రజలు గమనిస్తారని తెలిపారు. ఇదే విధంగా ఈ నెల 26న జరగనున్న డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు స్పష్టం చేశారు.

ఇది మంచి సంప్రదాయం కాదు

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత రాష్ట్రంలో జరిగిన దాడులు, ఘటనలను ఆయన ఖండించారు. తన 35 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇంత దారుణమైన పాలన, ప్రవర్తన చూడలేదని చెప్పారు. ప్రత్యర్థి పార్టీ నేతలపైనే కాకుండా వారి ఆస్తులు, ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టడం మంచి సంప్రదాయం కాదని హితవు పలికారు. తానెప్పుడూ ఇటువంటి రాజకీయాలు చూడలేదు, చేయలేదని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్‌కుమార్, మళ్ల విజయ్‌ప్రసాద్, తిప్పల దేవన్‌రెడ్డి, మలసాల భరత్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, తైనాల విజయ్‌కుమార్, చింతలపూడి వెంకట్రామయ్య, మాజీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టమూరి సతీష్, ఫ్లోర్ లీడర్లు, కార్పొరేటర్లు, నేతలు పాల్గొన్నారు.

చందనోత్సవం టికెట్ల విక్రయాలు ప్రారంభం

- ఒక ఆధార్‌పై 4 టికెట్లు మాత్రమే జారీ
- 30న ఉదయం 5 గంటలలోపే ప్రొటోకాల్ వీఐపీల దర్శనాలు పూర్తి



చందనోత్సవం టిక్కెట్లను భక్తులకు అందిస్తున్న దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు

సింహాచలం: సింహగిరిపై చందనోత్సవం టిక్కెట్ల విక్రయాలు గురువారం ప్రారంభమయ్యాయి. పాత పీఆర్వో కార్యాలయంలో ఉదయం 7 నుంచి రూ.300, రూ.వెయ్యి టికెట్ల విక్రయాలను ప్రారంభించి, దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు చేతుల మీదుగా భక్తులకు అందించారు. ఒక ఆధార్ నెంబరుతో నాలుగు టిక్కెట్లు మాత్రమే జారీ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో ఈవో మాట్లాడుతూ రూ.300, రూ.వెయ్యి టికెట్లను ఉదయం 3.30 నుంచి రాత్రి 7 వరకు పలు టైం స్లాట్‌లుగా విభజించి జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 30న తెల్లవారుజాము 3 గంటలకు దేవస్థానం అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజు తొలిదర్శనం కాగానే, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టువస్త్రాలు సమర్పిస్తారని పేర్కొన్నారు. ఉదయం 5లోపు ప్రొటోకాల్ వీఐపీల దర్శనాలు పూర్తిచేస్తామన్నారు. వారికి మాత్రమే అంతరాలయ దర్శనం కల్పిస్తామన్నారు. ఆ తర్వాత వచ్చిన వారికి నీలాద్రిగుమ్మం వద్ద నుంచే దర్శనం ఉంటుందన్నారు. ప్రొటోకాల్ వీఐపీలను రెండు కేటగిరీలుగా విభజించినట్లు పేర్కొన్నారు. దేవస్థానం చైర్మన్, సీఎం, మంత్రులు, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులకు ఉచితంగానే దర్శనం కల్పిస్తామన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా రూ.1500 ప్రొటోకాల్ టిక్కెట్లు తీసుకోవాల్సిందేనని, వారితో పాటు ఆరుగురికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఈ టికెట్లను ఎవరెవరికి జారీ చేయాలో జిల్లా కలెక్టర్ నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. ఈసారి నీలాద్రి గుమ్మం వద్ద ఆరు క్యూలైన్లలోనే భక్తులు వెళ్లి స్వామిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

బ్యాంకుల్లో జారీ కాని టికెట్లు

సింహాచలం: ఏడాదిలో ఒక్క రోజు, అది కూడా కొన్ని గంటలు మాత్రమే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిజరూప దర్శనం లభిస్తుంది. దీని టికెట్ల కోసం లక్షలాది మంది భక్తులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తుంటారు. ఈ ఏడాది వాళ్ల ఆశలపై ఆదిలోనే కూటమి ప్రభుత్వం నీళ్లు జల్లింది. అధికార యంత్రాంగం అలసత్వమే ఇందుకు కారణమైంది. చందనోత్సవానికి రూ.300, రూ.వెయ్యి టికెట్ల విక్రయాలను గురువారం నుంచి ప్రారంభిస్తామని ప్రకటించారు. సింహాచలం కొండపైన, సింహాచలంలోనే ఉన్న యూనియన్ బ్యాంక్, స్టేట్‌బ్యాంకులతో పాటు నగరంలోని అక్కయ్యపాలెం, కేజీహెచ్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌ల్లోను, బిర్లా జంక్షన్, సాలిగ్రామపురం ఎస్‌బీఐ బ్రాంచ్‌ల్లో టికెట్లు లభిస్తాయని ప్రకటించారు. తీరా చూస్తే సింహగిరిపైన, సింహాచలంలోని బ్రాంచుల్లో తప్ప నగరంలోని మరే బ్రాంచుల్లోనూ టికెట్ల విక్రయాలు గురువారం జరగలేదని తెలిసింది. ఆయా బ్రాంచ్‌ల వద్ద టికెట్ల కోసం వెళ్లినవారికి నిరాశే ఎదురైంది. ఇందుకు కారణం టికెట్లను ఆయా బ్రాంచిలకు అందించకపోవడమేనని సమాచారం. గురువారం సాయంత్రానికి బ్యాంక్ శాఖలకు టికెట్లు పంపించే ఏర్పాట్లు చేసినట్లు తెలిసింది. ఆన్‌లైన్‌లో కూడా టికెట్లకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

స్నేహశీలి.. చంద్రమౌళి

కుటుంబ సభ్యులు, స్నేహితుల కన్నీటి పర్యంతం



ఏయూక్యాంపస్: స్నేహశీలిగా, సేవా దృక్పథం కలిగిన వ్యక్తిగా, ఆధ్యాత్మిక భావాలు గల విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి జె.ఎస్.చంద్రమౌళి మరణం ఆయన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు తీరని వేదనను మిగిల్చింది. విహారం కోసం కశ్మీర్‌లోని పహల్గాం వెళ్లిన ఆయన.. ఉగ్రవాదుల ఆకస్మిక దాడిలో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నెల 18న పుట్టినరోజు జరుపుకున్న ఆయన.. అదే రోజు తన భార్య, మరో రెండు కుటుంబాలతో కలిసి కశ్మీర్ బయలుదేరారు. ఉగ్రదాడిలో ఆయన మరణవార్త విని వారంతా తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా చంద్రమౌళి ఎంతో ఉత్సాహంగా ఉండేవారు. ఆదివాసీ ప్రాంతాలకు వెళ్లి దుప్పట్లు పంపిణీ చేయడంతో పాటు, విశ్రాంత ఉద్యోగుల సంఘం తరఫున, వ్యక్తిగతంగా ఎన్నో సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకున్నారు. ఆధ్యాత్మిక భావాలు అధికంగా ఉండటంతో దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను తరచుగా సందర్శించేవారు. చంద్రమౌళి మరణంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ.. ఆయనతో గడిపిన క్షణాలను స్మరించుకుంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. మంచి వ్యక్తిని కోల్పోయామని తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన ఉగ్రవాదులకు తగిన శిక్ష పడాలని వారంతా కోరుతున్నారు.

ప్రాణాలతో బయటపడ్డాం కానీ..


కశ్మీర్ దాడి భయానక క్షణాలను వివరించిన దంపతులు



శశిధర్, సుచిత్ర దంపతులు

కశ్మీర్ పహల్గాంలో జరిగిన దాడిలో విశాఖకు చెందిన చంద్రమౌళి మృతి చెందగా.. ఆయన మిత్రులు శశిధర్, సుచిత్రలు ప్రాణాలతో బయటపడ్డారు. చంద్రమౌళి, శశిధర్, అప్పన్న కుటుంబాలు ఈ నెల 18న కశ్మీర్ విహారయాత్రకు బయలుదేరి వెళ్లాయి. ఈ నెల 25న అందరూ విశాఖకు తిరిగి రావాల్సి ఉంది. కానీ 22న పహల్గాం దాడిలో చంద్రమౌళి ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటనలో తాము ఎదుర్కొన్న భయానక పరిస్థితులను వారు వివరించారు. దాడి జరిగిన సమయంలో కొండపై ఉన్న క్యాంటీన్ సమీపంలో ఉన్నామని, కాల్పుల శబ్దాలు వినిపించగానే భయంతో టాయిలెట్ల వెనుక దాక్కున్నామని సుచిత్ర తెలిపారు. తుపాకీతో కనిపించిన ఉగ్రవాది తమవైపు రావడం చూసి, ప్రాణ భయంతో నుదుటిన బొట్టు కూడా చెరుపుకుని, సమీపంలోని వాగులో ముఖాలు కడుక్కున్నామని చెప్పారు. భయం ఎక్కువగా ఉన్నా.. దైవనామస్మరణ చేస్తే ఆ శబ్దం విన్నా చంపేస్తారేమోననిపించి అది కూడా చేయలేదని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. శశిధర్ మాట్లాడుతూ కాల్పులకు భయపడి తాము ఫెన్సింగ్ కింద నుంచి దూరి చెట్ల వెనుక దాక్కునే ప్రయత్నం చేశామన్నారు. తన భార్య సుచిత్ర ఫెన్సింగ్ దాటడానికి చంద్రమౌళి సహాయం చేశారని గుర్తు చేసుకున్నారు. కాల్పులు జరుగుతున్నప్పుడు కళ్లముందే మనుషులు నేలకొరగడం చూశామన్నారు. చంద్రమౌళి కాల్పుల్లో మృతి చెందారని తర్వాత తెలిసి తీవ్ర ఆవేదనకు లోనైనట్లు చెప్పారు. కశ్మీర్ వెళ్దామని రెండేళ్లుగా ప్లాన్ చేసుకుని ఇప్పుడు వెళ్తే, తమ మిత్రుడిని కోల్పోవాల్సి వచ్చిందని శశిధర్ దంపతులు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రతి ఏటా విహారయాత్రలకు వెళ్లే తమకు, ఈ పర్యటన తీరని విషాదాన్ని మిగిల్చిందని సుచిత్ర ఆవేదన వ్యక్తం చేశారు. కాగా.. చంద్రమౌళి కుమార్తెలు అమెరికా నుంచి రావడంతో.. శుక్రవారం అతని అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు బంధువులు తెలిపారు.


పుట్టిన రోజునే ప్రయాణం



ఈ నెల 18న చంద్రమౌళి తన జన్మదినం చేసుకున్నారు. అదే రోజున చంద్రమౌళి కుటుంబం, మరో రెండు కుటుంబాలు కలిసి కశ్మీర్ వెళ్లాయి. అక్కడ వారు ఆలయాల దర్శనం చేసుకున్నారు. ఆయన నాకు వరుసకు మావయ్య అవుతారు. ఇలా ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోవడం నన్ను తీవ్రంగా బాధించింది. సామాజిక కార్యక్రమాల్లో ఎంతో చురుకుగా పాల్గొనేవారు. ఇటువంటి దారుణమైన సంఘటన జరిగినప్పుడు సహనం వహించడం, ఉపేక్షించడం ఎంత వరకు సమంజసం? ప్రభుత్వం ఈ విషయంలో తగిన విధంగా స్పందిస్తుందని ఆశిస్తున్నాం.

– బి.చంద్రమౌళి, మృతుడి బంధువు

1985 నుంచి స్నేహితులం



నిత్యం నాకు ఫోన్‌లో గుడ్‌మార్నింగ్ చెప్పేవారు. 1985 నుంచి ఆయనతో నాకు స్నేహం ఉంది. అక్కయ్యపాలెంలోని అతని ఇంటి దగ్గరలోనే మా ఇల్లు ఉంది. మంగళవారం ఉదయం కూడా నాకు మెసేజ్ పంపారు. బుధవారం నేను మెసేజ్ చేసినా.. ఆయన నుంచి సమాధానం రాలేదు. చంద్రమౌళి సేవా కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనేవారు. అరకు వంటి ప్రాంతాల్లో దుప్పట్లు పంచడం, వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మంచి వ్యక్తిత్వం ఉన్న వ్యక్తిని ఉగ్రవాదులు చంపడం కలచివేస్తోంది. మనసుకు చాలా బాధగా ఉంది.

–శ్యాంప్రసాద్, స్నేహితుడు

నగరంలో నేరాలు తగ్గాలి

- రాత్రి పూట నిఘా పటిష్టం చేయాలి
- మహిళల భద్రతకు ప్రాధాన్యం
- నేర సమీక్ష సమావేశంలో సీపీ శంఖబ్రత బాగ్చి


మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: విశాఖలో క్రైమ్ రేటు తగ్గుముఖం పట్టేలా రాత్రి పూట నిఘా మరింత పటిష్టం చేయాలని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. గురువారం పోలీస్ సమావేశ మందిరంలో పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి ఏడీసీపీల నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నగరంలో యాక్టివ్‌గా ఉన్న రౌడీషీటర్లు, వారిపై పెడుతున్న నిఘాపై ఆరా తీశారు. పోలీస్‌స్టేషన్లలో పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాటిని సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి స్టేషన్ పరిధిలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పూర్తిగా నివారించాలని సూచించారు. ఆయా స్టేషన్ల పరిధిలో నిర్మానుష్య, సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలిస్తూ విజిబుల్ పోలీసింగ్, పికెట్‌లు, అవసరం మేరకు డికాయ్ టీమ్‌లు ఏర్పాటు చేయాలని చెప్పారు. నగరంలో గంజాయి ఎక్కడా ఉండకూడదని, ఈవ్‌టీజింగ్, ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్ వంటివి ఏ స్టేషన్ పరిధిలోనూ చోటు చేసుకోకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు అదనంగా వెహికల్, మెన్ ఇతర అవసరాలు ఉంటే తనకు తెలియజేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కొత్త సాఫ్ట్‌వేర్లు తీసుకొని నేరాల నియంత్రణకు వినియోగించాలని చెప్పారు. మహిళల భద్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, వారిపై వేధింపులు, మిస్సింగ్ సంబంధిత కేసుల్లో జాప్యం లేకుండా దర్యాప్తు చేపట్టాలని చెప్పారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పూర్తి పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని, విధుల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు, అధికార దుర్వినియోగానికి, అవినీతికి పాల్పడినా తక్షణమే వారిపై కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీసీపీ–2 డి.మేరీప్రశాంతి, డీసీపీ(అడ్మిన్) కృష్ణ కాంత్ పటేల్, డీసీపీ(క్రైమ్స్) కె.లతామాధురి ఇతర అధికారులు పాల్గొన్నారు.

తొలి విడత చందనం అరగదీత ప్రారంభం


చందనాన్ని అరగదీస్తున్న ఈవో సుబ్బారావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో తొలివిడత చందనం అరగదీత గురువారం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. ఈ నెల 30న వైశాఖ శుద్ధ తదియనాడు జరిగే స్వామివారి చందనోత్సవం(నిజరూప దర్శనం) అనంతరం ఆ రోజు రాత్రి తొలివిడతగా సమర్పించాల్సిన మూడు మణుగుల(సుమారు 125 కిలోలు) పచ్చి చందనాన్ని సమకూర్చేందుకు ఏకాదశిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టారు. తొలుత ఆలయ బేడా మండపంలోని భాండాగారం వద్ద తొలి చందనం చెక్కను ఉంచి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, షోడశోపచారపూజలు జరిపారు. అనంతరం ఆ చందనం చెక్కతో ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల మధ్య బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అనంతరం నోటికి వస్త్రం చుట్టుకుని తొలి చందనాన్ని అరగదీశారు. అనంతరం ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు చందనాన్ని అరగదీశారు. అరగదీసిన చందనాన్ని స్వామివారి మూలవిరాట్‌కి సమర్పించారు. అనంతరం 20 మంది నాల్గవ తరగతి సిబ్బంది చందనం అరగదీతలో పాల్గొన్నారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ త్రిమూర్తులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భూముల ఆక్రమణలపై అప్రమత్తంగా ఉండండి

సాక్షి, విశాఖపట్నం : పారిశ్రామిక భూముల ఆక్రమణలపై అప్రమత్తంగా వ్యవహరించాలని.. ఏ చిన్న ఫిర్యాదు వచ్చినా వెంటనే స్పందించి పరిష్కరించాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించారు. పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే వారికి అధికారులు సంపూర్ణ సహకారం అందించాలని సూచించారు. 2025–26 వార్షిక ప్రణాళికను దృష్టిలో పెట్టుకొని ఔత్సాహికులు, అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని, వీలైనన్ని పారిశ్రామిక యూనిట్లు నెలకొల్పాలన్నారు. ఇప్పటికే నడుస్తున్న పారిశ్రామిక కేంద్రాల్లో సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, అక్కడ నుంచి వచ్చే వినతులపై వేగంగా స్పందించి చర్యలు చేపట్టాలన్నారు. గాజువాక, ఆటోనగర్ వద్ద గల రోడ్ ఓవర్ బ్రిడ్జి(ఆర్‌వోబీ), పెదగంట్యాడ, అగనంపూడి, ఆటోనగర్లలో ఫ్లాట్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్, పీఎం విశ్వకర్మ యోజన పథకం తదితర అంశాలపై చర్చించారు. నిర్మాణాలకు, పరిశ్రమల నిర్వహణకు అవసరమైన నీటి వనరులను సమకూర్చాలని, సొసైటీ భవనాల నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. భూ సేకరణ, సింగిల్ విండో క్లియరెన్స్ అంశాల్లో వేగం పెంచాలని ఆదేశించారు. జిల్లా పరిశ్రమల శాఖ జీఎం వి.ఆదిశేషు, నాబార్డ్ డెవలప్‌మెంట్ మేనేజర్ బసంత్‌కుమార్, పలు పరిశ్రమల నిర్వాహకులు, ఐలా ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల సమస్యల పరిష్కారానికి చర్యలు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ పరిధిలోని టిడ్కో ఇళ్ల సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని ఏపీ టిడ్కో ఎండీ బి.సునీల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌తో కలిసి టిడ్కో ఇళ్లపై సమీక్ష నిర్వహించారు. జీవో 39లో ఇచ్చిన మార్గదర్శకాలపై అధికారులతో చర్చించారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లు, బ్యాంకు రుణాలపై సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బినామీల చేతుల్లోకి భృతి?

- మత్స్యకార నిషేధ భృతి జాబితాలో అక్రమాలు!
- వాస్తవం కన్నా ఎక్కువ సంఖ్యలో లబ్ధిదారులు
- ఈ దందా వెనుక ఓ యూనియన్ నాయకుడు?


మరమ్మతులకు గురైన బోటు

డాబాగార్డెన్స్: వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు ఇవ్వాల్సిన నిషేధ భృతిని గత ఏడాది కూటమి ప్రభుత్వం ఎగ్గొట్టింది. ఈ ఏడాది ఇప్పటికే వేట నిషేధం అమల్లోకి రాగా.. నిషేధ భృతిని ఈ నెల 26న అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించి ఇప్పటికే మత్స్యకారులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ భృతి పంపిణీకి సంబంధించి అక్రమాలు జరుగుతున్నాయని.. కొందరు అనర్హుల పేర్లను జాబితాలో చేర్చినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే కొందరు యూనియన్ నాయకులు అర్హులైన వారి పేర్లు తప్పించి.. వారికి అనుకూలంగా ఉన్న మత్స్యకారుల పేర్లు చేర్చినట్లు సమాచారం.

విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో సుమారు 600 మర పడవలు, 300 తెప్పలు ఉన్నాయి. ఒక్కో మర పడవలో ఏడుగురు మత్స్యకారులు, ఒక్కో తెప్పకు నలుగురు మత్స్యకారులు ఉంటారు. అయితే అసలు మత్స్యకారుల సంఖ్యను పెంచి చూపుతున్నారని తెలుస్తోంది. ఉదాహరణకు ఏడుగురు సిబ్బంది ఉన్న మరపడవల్లో తొమ్మిది మంది ఉన్నట్లుగా ఓ యూనియన్ నాయకుడు లెక్కలు చూపి.. అదనంగా ఇద్దరు పేర్లు చేర్చినట్లు భోగట్టా. ఈ విధంగా 600 మర పడవలకు, 300 తెప్పలకు బినామీ పేర్లను చేర్చి.. లబ్ధిదారుల సంఖ్యను వాస్తవం కన్నా ఎక్కువగా చూపుతున్నట్లు తెలుస్తోంది.

'నీకు సగం.. నాకు సగం'

ఓ మత్స్యకార సంఘం నాయకుడు ఈ దందా వెనుక ఉన్నాడని ఆరోపణలు వస్తున్నాయి. అనర్హులైన వారి పేర్లు చేర్చి, వారికి వచ్చే భృతిలో సగం తనకు ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకుంటున్నారని, ఈ తతంగం ద్వారా సుమారు రూ.కోట్ల అక్రమాలకు పాల్పడేందుకు స్కెచ్ వేశాడని కొందరు మత్స్యకారులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. 'నీకు సగం... నాకు సగం'పద్ధతిలో అర్హులైన మత్స్యకారులకు రావాల్సిన భృతి.. అక్రమార్కుల జేబుల్లోకి వెళ్లనుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. కాగా.. ఫిషింగ్ హార్బర్‌లో నమోదైన 600 మర పడవల్లో చాలా కాలంగా మూలనపడిన లేదా మరమ్మతులకు గురైన సుమారు 110కి పైగా పడవలు ఉన్నట్లు సమాచారం. అయితే విశాఖ పోర్టుకు జెట్టీ ఫీజు చెల్లిస్తూ.. ఈ బోట్ల కూడా వేటకు వెళ్తున్నట్లుగా పత్రాల్లో చూపినట్లు సమాచారం. వీటిల్లో పనిచేస్తున్నట్లుగా మత్స్యకారుల పేర్లను జాబితాలో చేర్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

అర్హులుగానీ అనర్హులు

మరో ప్రధాన సమస్య ఏమిటంటే కేంద్ర ప్రభుత్వం ఏడేళ్ల కిందట కొంతమంది మత్స్యకారులకు గుర్తింపు కార్డులు జారీ చేసింది. ఆ తర్వాత మత్స్యకారులుగా మారిన ఎంతో మందికి ఇప్పటివరకు గుర్తింపు కార్డులు అందలేదు. దీంతో అర్హులైనప్పటికీ గుర్తింపు కార్డులు లేకపోవడం వల్ల వారు మత్స్యకార భరోసా పథకానికి అనర్హులుగా మిగిలిపోతున్నారు. ఒకపక్క బినామీలు జాబితాలో చేరుతుంటే.. మరోపక్క అర్హులు గుర్తింపు కార్డులు లేక లబ్ధి పొందలేకపోవడంపై మత్స్యకార వర్గాల్లో అసంతృప్తి నెలకొంది. ఈ మొత్తం వ్యవహారంపై అధికారులు దృష్టి సారించి.. అర్హులైన ప్రతి మత్స్యకారుడికీ భృతి అందేలా చూడాలని వారు కోరుతున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

అల్లిపురం: వేట నిషేధ భృతి జాబితాలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ పెదజాలారిపేటకు చెందిన సూరాడ సోమేశ్వరరావు కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ లంచాలు తీసుకుంటూ.. అర్హులైన మత్స్యకారులకు అన్యాయం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బోట్లు, లైసెన్స్‌లు కలిగి ఉన్న అర్హులైన మత్స్యకారులను నమోదు చేయకుండా.. బినామీల పేరిట పాడైన బోట్లు కొని, వాటికి నకిలీ లైసెన్స్‌లు సృష్టించిన వారిని నమోదు చేస్తున్నారని ఆరోపించారు. తమ రెండు బోట్లు రన్నింగ్‌లో ఉన్నప్పటికీ.. జాబితాలో నమోదు చేయకుండా అధికారులు అడ్డుకుంటున్నారని వాపోయారు. చేతకాకపోతే బోట్లు అమ్మేయండి అంటూ అధికారులు సలహాలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కలెక్టర్ జోక్యం చేసుకుని అధికారులను పిలిపించి మాట్లాడినా.. ఆ అధికారుల తీరు మారలేదన్నారు. పైగా తమను బెదిరిస్తున్నారని ఆరోపించారు. శుక్రవారంతో పేర్ల నమోదు ప్రక్రియ దాదాపు పూర్తి కానున్న నేపథ్యంలో.. అర్హులైన మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరుతున్నారు.

విధుల నుంచి ఇన్విజిలేటర్ తొలగింపు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్ర యూనివర్సిటీ దూరవిద్య పరీక్షలు జరుగుతున్న సమయంలో ఓ యువతి పట్ల ఇన్విజిలేటర్ అనుచితంగా ప్రవర్తించారన్న ఆరోపణలు కలకలం సృష్టించాయి. ఈ ఘటనపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు విచారణ కమిటీని ఏర్పాటు చేసి, తక్షణమే ఇన్విజిలేటర్‌ను విధుల నుంచి తొలగించారు. మూడు రోజుల క్రితం ఈ సంఘటన జరిగింది. బాధితురాలైన యువతి ఇన్విజిలేటర్ తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని తన కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో వారు వెంటనే కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబును కలిసి ఫిర్యాదు చేశారు. పరీక్ష రాసే యువతుల వద్దకు వెళ్లి సదరు ఇన్విజిలేటర్ 'పరీక్ష ఎలా రాశావంటూ' భుజాలపై చేతులు వేస్తున్నారని, ఇది కొందరికి ఇబ్బందికరంగా ఉందని ఆరోపణలు వెల్లువెత్తాయి. వయసులో పెద్దవాడని కొందరు సర్దుకుపోయినా, మరి కొందరు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు ఇన్విజిలేటర్‌కు వి.ఎస్.కృష్ణా డిగ్రీ కళాశాలకు సంబంధం లేదని ప్రిన్సిపాల్ తెలిపారు. ఏయూ దూరవిద్యా విభాగం ద్వారా దినసరి వేతనంపై కేవలం పరీక్షల విధులకు మాత్రమే నియమితులైనట్లు చెప్పారు. ఘటన తీవ్రత నేపథ్యంలో ఇన్విజిలేటర్‌ను తక్షణమే విధుల నుంచి తొలగించినట్లు వెల్లడించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని, పరీక్ష గదిలో అ సమయంలో ఉన్న వారందరినీ విచారించి తదుపరి చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు.

ఏయూలో వింత పోకడలు

- ఫీజు కట్టించుకొని పరీక్షలకు అనుమతించని వైనం
- వీసీ భవనం ముందు విద్యార్థులు ధర్నా


వీసీ భవనం ముందు ధర్నా చేస్తున్న విద్యార్థులు

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ అధికారులు అవలంబిస్తున్న విధానాలతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు ఆరోపించారు. గురువారం రాత్రి వర్సిటీ వైస్ చాన్సలర్ భవనం ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. వివరాల్లోకి వెళితే.. యూనివర్సిటీ ఆధ్వర్యంలో డిగ్రీ రెండు, నాల్గో సెమిస్టర్ పరీక్షలు ప్రస్తుతం జరుగుతున్నాయి. వర్సిటీ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో సుమారు 30 మంది విద్యార్థులను గురువారం జరిగిన పరీక్షకు కాలేజీ నిర్వాహకులు అనుమతించలేదు. హాజరు శాతం సరిపోలేదనే కారణంతో పరీక్షలు రాయడానికి వీల్లేదని, హాల్ టికెట్లు ఇచ్చేందుకు నిరాకరించారు. దీంతో తొలిరోజు పరీక్షను విద్యార్థులు కోల్పోయారు. అయితే హాజరు సరిపోకున్నా, కొంతమంది విద్యార్థులను తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో పరీక్షలకు అనుమతించారని తెలుసుకున్న బాధిత విద్యార్థులు దీనిపై వర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. కానీ వారి గురించి ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో ఈ విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ సంఘాల నాయకులు విద్యార్థులతో చర్చించారు. విషయాన్ని కాలేజీ నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోకపోవడంతో విద్యార్థులతో కలసి వైస్ చాన్సలర్ భవనం ముందు ధర్నా చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య శశిభూషణరావు అక్కడికి చేరుకుని విద్యార్థులతో చర్చించారు. ఫీజు చెల్లించినందున, తదుపరి పరీక్షలకు అనుమతించాలని కోరారు. తాము పరీక్షలను పూర్తిగా కోల్పోతే, అది ఉత్తీర్ణతపై ప్రభావం చూపుతుందన్నారు దీనిపై పూర్తి స్థాయిలో సమీక్షించి, తదుపరి చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపాల్ ఆచార్య శశిభూషణరావు హామీ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నా విరమించారు. ఆందోళనలో విద్యార్థి సంఘం నాయకులు అభిషేక్, సంజు, వికాస్, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ నచ్చేలా 'సారంగపాణి జాతకం'

హీరో ప్రియదర్శి



మాట్లాడుతున్న హీరో ప్రియదర్శి, హీరోయిన్ రూపా, దర్శకుడు ఇంద్రగంటి

డాబాగార్డెన్స్: 'సారంగపాణి జాతకం'లో తాను చేసిన పాత్ర, ఈ చిత్రం అందరికీ నచ్చుతుందని హీరో ప్రియదర్శి తెలిపారు. ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో ప్రియదర్శి, రూపా కొడువాయూర్ జంటగా నటించిన చిత్రం 'సారంగపాణి జాతకం'. శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం రిలీజ్ కానున్న నేపథ్యంలో ఆ చిత్ర యూనిట్ గురువారం నగరంలో సందడి చేసింది. ఈ సందర్భంగా జగదాంబ సమీపంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో హీరో ప్రియదర్శి మాట్లాడారు. తాను నటించిన మల్లేశం, బలగం, కోర్ట్ సినిమా తరహా భావోద్వేగాలతో సాగే ఓ సాధారణ వ్యక్తి కథే సారంగపాణి జాతకం అన్నారు. ఇంద్రగంటితో ఒక ఫొటో దిగితే చాలనుకునే వాడినని.. ఇప్పుడు ఆయన దర్శకత్వంలో నటించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సినిమాలో ఆంధ్ర యాసలో డైలాగ్‌లు చెప్పినట్లు వివరించారు. హీరోయిన్ మాట్లాడుతూ అందర్నీ ఈ సినిమా ఆకట్టుకుంటుందన్నారు. ఆద్యంతం హాస్యంతో పాటు ప్రతీ సన్నివేశం ప్రేక్షకులను అలరిస్తుందన్నారు. దర్శకుడు ఇంద్రగంటి మాట్లాడుతూ విశాఖ అంటే తనకు ఎంతో ఇష్టమన్నారు. మంచి కథతో అందరూ ఇష్టపడే హాస్యంతో రూపొందించిన ఈ సినిమాను ఆదరించాలని ప్రేక్షకులను కోరారు.

97 మంది పోలీసులకు రివార్డులు

విశాఖ సిటీ: పోలీస్ శాఖలో ఉత్తమ ప్రతిభ చూపించిన 97 మంది పోలీస్ సిబ్బందికి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి రివార్డులు అందజేశారు. హోంగార్డు నుంచి సీఐ స్థాయి అధికారి వరకు విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన వారికి సత్కరించారు. గంజాయి, చోరీ కేసుల్లోను, సాంకేతిక పరిజ్ఞానంతో నేరస్తుల అరెస్టు చేసిన 97 మందికి గురువారం పోలీస్ సమావేశ మందిరంలో సీపీ తన చేతుల మీదుగా రివార్డు మంజూరు ఆర్డర్లను అందించారు.

ఏయూలో శతాబ్ది ఉత్సవాల జోష్


ఫ్లాష్‌మాబ్‌లో పాల్గొన్న విద్యార్థులు

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీలో శతాబ్ది ఉత్సవాల జోష్ కనిపిస్తోంది. ఈ నెల 26న వర్సిటీ వందో ఏట అడుగుపెట్టనున్న సందర్భంగా ఏడాది పొడవునా వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇందులో భాగంగా వర్సిటీ పరిపాలన భవనాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. దీంతో క్యాంపస్‌లో శతాబ్ది ఉత్సవాల శోభ వెల్లివిరుస్తోంది. ఈ వేడుకల కోసం క్యాంపస్ కాలేజీ విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా సిద్ధమవుతున్నారు. గురువారం సాయంత్రం కాలేజీ విద్యార్థులు నిర్వహించిన ఫ్లాష్ మాబ్ విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థులందరూ ఉత్సవాల్లో భాగస్వాములు కావాలనే సందేశాన్ని ఇస్తూ.. నృత్యాలతో అలరించారు.

చర్చిలో బాలిక అనుమానాస్పద మృతి?


బాలిక మృతదేహం వద్ద అమ్మమ్మ, అమ్మ

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ చర్చిలో గురువారం సాయంత్రం 11 ఏళ్ల బాలిక అనుమానాస్పదంగా మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు.. విజయనగరానికి చెందిన ఈదల పూర్ణచంద్రిక(11)కు ఎవరో చేతబడి చేశారని.. బాలిక తల్లి వరలక్ష్మి, అమ్మమ్మ సావిత్రి చర్చిల చుట్టూ తిప్పుతున్నారు. గురువారం సాయంత్రం జ్ఞానాపురంలోని సెయింట్ పీటర్స్ చర్చికి బాలికను తీసుకొచ్చారు. ప్రార్థనలు చేసిన సమయంలో తల చుట్టూ చున్నీ కప్పి నోట్లో గుడ్డలు కుక్కినట్లు తెలుస్తోంది. ఊపిరాడక బాలిక చర్చిలోనే ప్రాణం వదిలినట్లు పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మూఢనమ్మకంతో తల్లి, అమ్మమ్మ ఈ విధంగా చేశారని స్థానికులు చెబుతున్నారు. చర్చి ప్రతినిధులు, స్థానికుల సమాచారం మేరకు కంచరపాలెం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాలిక తల్లి, అమ్మమ్మను విచారిస్తున్నారు.

మరి కొంతకాలం స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రస్తుతం నడుస్తున్న పలు ప్రత్యేక రైళ్లను మరి కొంతకాలం పొడిగించినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. విశాఖపట్నం–చర్లపల్లి(08579) స్పెషల్ శుక్రవారాల్లో సాయంత్రం 5.35 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.40 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈ స్పెషల్‌ను ఈ నెల 25, మే 2, 9, 16, 23, 30వ తేదీ వరకు పొడిగించారు. చర్లపల్లి–విశాఖపట్నం(08580) స్పెషల్ శనివారాల్లో రాత్రి 7.40 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.40 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ స్పెషల్‌ను ఈ నెల 26, మే 3, 10, 17, 24, 31వ తేదీ వరకు పొడిగించారు.

- సంబల్‌పూర్–ఈరోడ్ (08311) ఎక్స్‌ప్రెస్ బుధవారాల్లో సంబల్‌పూర్‌లో ఉదయం 11.35 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 9.30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 9.32 గంటలకు బయలుదేరి మరుసటిరోజు గురువారం రాత్రి 8.30 గంటలకు ఈ రోడ్ వెళ్తుంది. ఈ రైలును మే 7 నుంచి జూన్ 25వ తేదీ వరకు పొడిగించారు. ఈరోడ్–సంబల్‌పూర్ (08312) వీక్లీ స్పెషల్ ఈరోడ్‌లో శుక్రవారాల్లో మధ్యాహ్నం 2.45 గంటలకు బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.08 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 1.10 గంటలకు బయలుదేరి శనివారం రాత్రి 11.15 గంటలకు సంబల్‌పూర్ వెళ్తుంది. ఈ స్పెషల్‌ను మే 9వ తేదీ నుంచి జూన్ 27వ తేదీ వరకు పొడిగించినట్లు సీనియర్ డీసీఎం తెలిపారు.

ఐకానికా సిటీ ప్రాజెక్టుకు భూమి పూజ


ఐకానికా ప్రాజెక్టుకు భూమి పూజ చేస్తున్న చినజీయర్ స్వామి

మధురవాడ: రుషికొండ సమీపంలో ఐకానికా గ్రాండ్, ఐకానికా క్యాపిటల్ ప్రీమియం, లగ్జరీ ప్రాజెక్టులు త్వరలో ఐకానికా సిటీ పేరుతో అందుబాటులోకి రానున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు గురువారం త్రిదండి చినజీయర్ స్వామి భూమి పూజ నిర్వహించారు. 97 ఎకరాల విస్తీర్ణంలో వరల్డ్ క్లాస్ సదుపాయాలుతో దీనిని నిర్మాణం చేస్తున్నట్టు నిర్వాహకులు చెప్పారు. ఐకానికి సిటీ అభివృద్ధిలో భాగంగా మొదటి దశలో ఐకానికా సిటీ ఆఫ్ గోల్డ్‌ని నిర్మిస్తారని, ఇది పూర్తిగా అల్ట్రా లగ్జరీ విల్లాలతో అత్యంత ఆధునికంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా చినజీయర్ స్వామి మాట్లాడుతూ ఈ సిటీలోకి వచ్చిన వారికి కిరాణా దుకాణం నుంచి అన్ని రకాలు సదుపాయాలు ఉండాలన్నారు. యోగా ఇతర సదుపాయాలతో పాటు గుడి కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వంలో ప్రాజెక్టు ప్రారంభమైందని, ఇప్పుడు తమ ఆధ్వర్యంలో భూమి పూజ కూడా జరగడం ఆనందించదగ్గ విషయమన్నారు. ఈ ప్రాజెక్టుకు తమ పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు. ఇందులో యాజమాన్య ప్రతినిధులు, అతిథులు మురళీకృష్ణ, సంతోష్, తారక్, డాక్టర్ రాజేశ్వరరావు, వేణు వినోద్, అల్లూరి రంగరాజు, అల్లూరి సీతారామరాజు, కేఎల్ సంతోష్, శ్రీవర్ధన్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి దేశానికి క్షోభ కలిగించింది

ఇది ముమ్మాటికీ హిందువులపై దాడి: పవన్ కల్యాణ్


చంద్రమౌళి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

ఏయూ క్యాంపస్: కశ్మీరులో ఉగ్రదాడి దేశం మొత్తానికి క్షోభ కలిగించిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఉగ్రదాడిలో మరణించిన విశాఖకు చెందిన చంద్రమౌళి కుటుంబాన్ని గురువారం రాత్రి ఆయన పరామర్శించారు. తొలుత ఆస్పత్రిలోని చంద్రమౌళి మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రాంతం, భాష, మతం అడిగి చంపటం అమానుషమన్నారు. హిందువులను టార్గెట్ చేసి చంపారని, దీనిపై మనమంతా ఏకతాటిగా నిలవాలన్నారు. భారత దేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కించపరిచేలా ఎవరైనా సోషల్‌మీడియాలో మాట్లాడినా, కామెంట్లు చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు పేర్కొన్నారు. పోయిన ప్రాణాలు తిరిగి రావని, భవిష్యత్‌లో ఇలాంటి దాడులు జరుగకుండా కేంద్ర ప్రభుత్వం బలమైన చర్యలు తీసుకుంటుందని విశ్వసిస్తున్నట్లు తెలిపారు. యుద్ధం మొదలుపెడితే అది ఎవరి చేతుల్లోనూ ఉండదనే విషయాన్ని గుర్తించాలన్నారు.

రొటేషన్ పద్ధతిలో నైట్ డ్యూటీలు

కేజీహెచ్ సూపరింటెండెంట్ ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..

డాబాగార్డెన్స్: నర్సింగ్ సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ ఆదేశించారు. 'కొందరికే నైట్ డ్యూటీ ఎందుకు?' శీర్షికతో 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. నర్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులతో గురువారం సూపరింటెండెంట్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని, నైట్ డ్యూటీలను రొటేషన్ పద్ధతిలో చేసుకోవాలని సూచించారు. ఇటీవల కేజీహెచ్‌ను సందర్శించిన అదనపు డీఎంఈ కూ డా ఈ విషయమై పలు ఆదేశాలు జారీ చేశారన్నారు. వార్డుల్లో ఏ సమస్య తలెత్తినా దానికి హెడ్ నర్సులదే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ప్రతి బ్లాక్‌కు తప్పనిసరిగా ఒక హెడ్ నర్సు ఉండాలని డీఎంఈ సూచించినట్లు సూపరింటెండెంట్ తెలిపారు.

పలువురు వైద్యులకు షోకాజ్ నోటీసులు

డాబాగార్డెన్స్: ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కేజీహెచ్ పర్యటన సమయంలో విధులకు హాజరుకాని పలువురు వైద్యులకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎల్.ఆర్.ఎస్ గిరినాథ్, ఆ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ వంశీ యాదవ్, డాక్టర్ మోహన్ వంశీ, నెఫ్రాలజీ విభాగాధిపతి డాక్టర్ జి.ప్రసాద్, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ రత్న ప్రభ, డాక్టర్ వైఎస్ అనితకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అలాగే అదనపు డీఎంఈ కేజీహెచ్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేసిన సమయంలో డ్యూటీలో ఉంటూ క్యాజువాలిటీలో రోగులను చూడకుండా పక్క గదిలో కాలక్షేపం చేస్తున్న వైద్యులు, సిబ్బందికి కూడా చార్జ్ మెమోలు జారీ అయ్యాయి. ఎమర్జెన్సీ విభాగాధిపతి డాక్టర్ వీఏఎస్ఎస్ మూర్తి, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ కె.నరసింగరావు, డాక్టర్ ఆర్.కిరణ్‌కుమార్‌తో పాటు క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జేఎస్‌కేవీ చక్రవర్తి, అనస్థీసియా టెక్నీషియన్ డాక్టర్ సీహెచ్ అమర్‌బాబు, హెడ్ నర్స్ కె.సుజాతకు చార్జ్ మెమోలు జారీ చేశారు.

వైశ్యరాజు జ్యుయలర్స్‌లో 18 క్యారెట్ బంగారం


వైశ్యరాజు జ్యుయలర్స్18 క్యారెట్ ఎక్స్‌క్లూజివ్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

విశాఖ సిటీ: బంగారం ధరలు పెరిగిన వేళ ప్రతి ఒక్కరికీ అందుబాటు ధరలో బంగారు ఆభరణాలు అందించాలన్న లక్ష్యంతో 18 క్యారెట్ గోల్డ్ ఎక్స్‌క్లూజివ్ షోరూమ్‌లు ఆశీల్‌మెట్టలో ప్రారంభించినట్లు వైశ్యరాజ్ జ్యుయలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ వైశ్యరాజ్ భద్రగిరి పేర్కొన్నారు. ఈ షోరూం గ్రౌండ్, సెకండ్ ఫ్లోర్లను వినయగర్ ప్యారడైజ్ భాగస్వాములు లగడపాటి కిరణ్‌కుమార్, మంత్రి శేషగిరి, మూడో ఫ్లోర్‌ను జామి నగేష్ ప్రారంభించినట్లు తెలిపారు. వినూత్నమైన డిజైన్లు, అత్యధిక కలెక్షన్లతో 18 క్యారెట్ బంగారు ఆభరణాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. దేశంలోనే ప్రథమంగా 18 క్యారెట్ ఎక్స్‌క్లూజివ్ షోరూం తమదే అన్నారు. ప్రారంభోత్సవ ఆఫర్‌గా 18 క్యారెట్ జ్యుయలరీపై తరుగు(వీఏ) 6శాతం నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైశ్యరాజు జ్యుయలర్స్ చైర్మన్ వైశ్యరాజు ఫల్గుణరాజు, సంస్థ డైరెక్టర్లు వైశ్యరాజు నరేష్, వైశ్యరాజు కిరణ్‌కుమార్, అధిక సంఖ్యలో కస్టమర్లు పాల్గొన్నారు.